జిల్లాకు 80 మూడు చక్రాల మోటారు వాహనాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాకు నియోజకవర్గానికి పది చొప్పున 80 మూడు చక్రాల మోటారు వాహనాలు పంపిణీ చేయనున్నట్లు వికలాంగుల శాఖ ఇన్‌ఛార్జి ఇడి శైలజ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు గల వారు, 70 శాతం అంగవైకల్యం ఉన్న వారు, డిగ్రీ పూర్తి చేసి వ్యాపారం చేస్తున్న వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 25వ తేదీ లోపు apdascac.ap.gov.in దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 08942 240519 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

- ట్రిపుల్ ఐటిలో పరిపాటిగా మారిన సీనియర్ల వేధింపులు
- భయపడి బయటకు చెప్పుకోలేని జూనియర్లు
- ఆత్మహత్యకు దారితీసిన సృజన్ సున్నిత మనస్తత్వం
- ఘటనలు జరుగుతున్నా మేలుకోని యాజమాన్యం

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

తమ తెలివితేటలు, ప్రతిభతో సీట్లు దక్కించుకుంటున్నారు. ఎన్నో ఆశలు, ఆశయాలతో ఆ క్యాంపస్‌లో అడుగుపెడుతున్నారు. తమ పిల్లలకు అక్కడ సీటు వచ్చిందంటే తల్లిదండ్రులు సంబరపడిపోతున్నారు. ఉద్యోగం చేసి తమను ఆదుకుంటాడని ఎన్నో ఆశలు పెట్టుకుని కళాశాలకు పంపిస్తున్నారు. అయితే అక్కడ సీనియర్ల వేధింపులు, కళాశాల యాజమాన్యం ఫలితంగా అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. దీంతో ఉద్యోగం, మంచి భవిష్యత్ పక్కన పెడితే కన్న కడుపులకు గర్భశోకమే మిగులుతోంది. ఇదీ ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం పురంలోని రాజీవ్ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) శ్రీకాకుళం క్యాంపస్ పరిస్థితి.

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

లేని ప్రేమకథతో డైవర్షన్‌కు యత్నం

మృతుడు ఓ విద్యార్థినితో చనువుగా ఉంటున్నట్లు తోటి విద్యార్థులు చెప్తున్నారు. అయితే అదే అంశాన్ని అధికారులు, పోలీసులు తమకు అనుకూలంగా మార్చుకుని ఘటనను డైవర్ట్ చేసేందుకు ప్రయత్నించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ విద్యార్థినితో పోలీసులు, అధికారులు ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలిసింది. ఘటన జరిగిన రోజు కూడా విద్యార్థినితో అధికారులు మాట్లాడినట్లు తెలుస్తోంది. తనకు ప్రపోజ్ చేశాడని, వేధిస్తున్నాడని చెప్పాలని సూచించినట్లు తెలిసింది. చెడు అలవాట్ల నిందపై తోటి విద్యార్థులంతా రివర్స్ అవడం, మంచివాడనే పేరుండడంతో ఆ పాచిక పారలేదని తెలుస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, ఎచ్చెర్ల

ఆర్‌జియుకెటిలో వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నా యాజమాన్యం నిర్లక్ష్యం వీడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదేళ్లలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2022 సెప్టెంబర్ 7న సాలూరుకు చెందిన భవిరి విశిష్ట రోషిణి అనే 17 ఏళ్ల బాలిక బలవన్మరణానికి పాల్పడింది. 2024 డిసెంబర్ 12న ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంకు చెందిన ప్రవీణ్ నాయక్ హాస్టల్ భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకి తనువు చాలించాడు. వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లుగా తేల్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. తాజాగా గుంటూరు జిల్లా ఎ.టి అగ్రహారానికి చెందిన సృజన్ ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర చర్చనీయాంశమైంది. విద్యార్థి మృతికి బాధ్యత వహించాల్సిన యాజమాన్యం దాన్నుంచి తప్పించుకోవడానికి రకరకాల కారణాలను తొలుత ప్రచారంలో పెట్టినట్లు తెలిసింది. మృతుడు సృజన్‌కు ఫిలిం మేకింగ్ అంటే ఇష్టమని, చదవడం ఇష్టం లేదని చెప్పేవాడని తోటి విద్యార్థులతో చెప్పించే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు మృతుడినీ యాజమాన్యం విడిచిపెట్టలేదు. చెడు అలవాట్ల వల్లే చనిపోయాడంటూ ట్రిపుల్ ఐటి అధికారులు నింద వేయడానికి వెనుకాడలేదు. దీనిపై తల్లిదండ్రులు, బంధువులు, తోటి విద్యార్థులు భగ్గుమన్నారు. విద్యార్థుల్లో ఎవరితోనైనా ఆ మాట చెప్పించాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో మృతి చెందిన విద్యార్థికి బాసటగా సహచర విద్యార్థులు ఆందోళనకు దిగడం అధికారుల మాటల్లో పసలేదని తేలిపోయింది. పోనీ విద్యార్థికి చెడు అలవాట్లు ఉంటే అధికారులు ఎప్పుడైనా పిలిచి మందలించారా? అవేవీ లేకుండా చెడు అలవాట్లు ఉన్నాయంటూ ఎలా నిర్ధారణకు వచ్చారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

సృజన్ (ఫైల్ ఫొటో)

వేధింపులే కారణమా..?

ఆత్మహత్య ఘటనకు అధికారులు మసిపూసి మారేడు కాయ చేసేందుకు రకరకాల ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. చెడు అలవాట్లు అంటూ నమ్మించేందుకు చేసిన ప్రయత్నం నెరవేరకపోవడం, విద్యార్థులంతా మూకుమ్మడిగా ఆందోళనకు దిగడంతో అసలు విషయం బయటకు రావడం మొదలుపెట్టింది. కొంతకాలంగా క్యాంపస్‌లో జరుగుతున్న సీనియర్ల ఆగడాలపై నోరెత్తడానికి భయపడిన విద్యార్థులు ఒక్కసారిగా తాము అనుభవిస్తున్న వేధింపులను బయటపెట్టారు. వేధింపులకు పాల్పడుతున్న ఎనిమిది మంది విద్యార్థుల పేర్లను బహిరంగంగా చెప్పిన తర్వాత చేసేది లేక యాజమాన్యం, పోలీసులు వారిపై తప్పనిసరి పరిస్థితుల్లో చర్యలకు దిగారు. అధికారులు విద్యార్థులను సస్పెండ్ చేయగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సమగ్ర విచారణ చేయాలి

తమకు కలిగిన కడుపు కోత మరొకరికి రాకూడదు. మంచి భవిష్యత్ కోసం కాలేజ్‌లో చేర్పించాం. ఇలా జరుగుతుందని అనుకోలేదు. మాకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి. మా కుమారుని మృతికి కారకులైన వారిని తక్షణమే శిక్షించాలి.

- సృజన్ తల్లిదండ్రులు జ్యోతి, కృష్ణప్రసాద్

గ్రామస్తులతో మాట్లాడుతున్న బేవరేజెస్ ప్లాంట్ యాజమాన్య ప్రతినిధులు

బేవరేజెస్ ప్లాంట్ మాకొద్దు

తేల్చిచెప్పిన రణస్థలం గ్రామస్తులు

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని రణస్థలం పంచాయతీ పరిధిలో గల జగనన్న కాలనీ సమీపంలో నిర్మించతలపెట్టిన బేవరేజెస్ ప్లాంట్‌ను స్థానికులు వ్యతిరేకించారు. ఈ ప్లాంట్‌కు సంబంధించి గతంలో యాజమాన్యం నిర్వహించిన సమావేశంలోనూ గ్రామస్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రజలను ఒప్పించేందుకు కొంతమంది పంచాయతీ పెద్దలతో తిరిగి గురువారం సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలోనూ ప్లాంట్ మాకొద్దని బండిపాలెం, నగరప్పాలెం, రణస్థలం, జె.ఆర్ పురం గ్రామాల రైతులు, గ్రామ పెద్దలు, యువకులు స్పష్టం చేశారు. వైసిపి నాయకులు మజ్జి రమేష్, కరిమజ్జి బాస్కరరావు తదితరులు మాట్లాడుతూ బేవరేజ్ ప్లాంట్‌లు ఉత్పత్తులను తయారు చేయడానికి, ప్లాంట్ నిర్వహణకు ఎక్కువ నీటిని వినియోగిస్తాయని తెలిపారు. దీనివల్ల తాగు, సాగునీటిపై ప్రభావం పడుతుందని, ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్ నుంచి వచ్చే వ్యర్థ జలాలను సరిగ్గా శుద్ధి చేయకుండా చెరువులు, కాలువలు, భూమిలో విడుదల చేస్తే, అది జల కాలుష్యానికి కారణమవుతుందన్నారు. ఈ నీటిలో రసాయనాలు, ఇతర కాలుష్య కారకాలు ఉండవచ్చని తెలిపారు. ప్లాంట్ నుంచి వ్యర్థ జలాలు వెళ్లేందుకు సరైన మార్గం లేదన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా వేల అడుగుల లోతులో బోర్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే స్థానికంగా ఉన్న బీరు పరిశ్రమతో భూగర్భ జలాలు అడుగంటాయని, ఆ కంపెనీ విడిచిన వ్యర్థాలు వర్షపు నీటితో కలిసి చెరువులు, నీటి మడుగుల్లోకి చేరడంతో ఆ నీరు తాగి పశువులు వ్యాధుల బారిన పడి చనిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి పరిస్థితి తమకు రాకూడదనే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా ప్లాంట్‌ను ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ముందుకెళ్తే ఆందోళన తప్పదని గ్రామస్తులు ముక్తకంఠంతో హెచ్చరించారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నాయకులు

గ్రూపు రాజకీయాలను సహించేది లేదు

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పార్టీలో గ్రూపు రాజకీయాలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే గొండు శంకర్ హెచ్చరించారు. పార్టీ అధిష్టానం సూచనలు, ఆదేశాలతో నియోజకవర్గంలో తాను తీసుకొనే నిర్ణయాలను పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి నగర, గార, శ్రీకాకుళం రూరల్ మండల అధ్యక్షులు, కార్యదర్శులు, యూనిట్, క్లస్టర్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పార్టీ పరిశీలకులు చింతల రామకృష్ణ ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవుల్లో నియమితులైన నాయకులు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు తాను అన్నివేళల్లో అందుబాటులో ఉంటానన్నారు. అదేవిధంగా పార్టీలో ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా వారికి అండగా ఉంటానన్నారు. పార్టీ నాయకులు సమన్వయంతో పని చేసి అధిష్టానం ఆదేశాలను, సూచనలను పాటిస్తూ మందుకు సాగాలన్నారు. పార్టీని నియోజకవర్గంలో ఐదేళ్లు ముందుకు తీసుకువెళ్లే బాధ్యత తనదేనన్నారు. తానంటే ఎవరికి ఇష్టం ఉన్నా, లేకున్నా పార్టీ కోసం పనిచేయాల్సిందేనన్నారు. దొంగ రాజకీయాలు, గ్రూపులు కడితే సంహించనని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ తనకైనా, వేరెవరికైనా టిక్కెట్ ఇచ్చినా వారి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. పదవులు శాశ్వతం కాదని, పార్టీ శాశ్వతమన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలకు చేరువగా ఉండి, ప్రభుత్వ పథకాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలని సూచించారు. ప్రజల సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కారం దిశగా కషి చేయాలని కోరారు. ముందుగా కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నగర అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన పాండ్రంకి శంకర్ మాట్లాడుతూ అందరిని కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ ప్రధాన కార్యదర్శి కోరాడ హరిగోపాల్, గార మండల అధ్యక్షులు లోపింటి రాధాకృష్ణ, శ్రీకాకుళం మండల అధ్యక్షులు మూకళ్ల శ్రీను, నాయకులు గొండు జగపతి, పి.ఎం.జె బాబు, కొర్ను ప్రతాప్, ప్రధాన విజయరాం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగమణి

'ఆశా'లకు కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పొందూరులో గురువారం ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెలవు లేకుండా ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. పిఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆరేళ్ల నుంచి ఒక్క రూపాయి వేతనం పెంచలేదని అన్నారు. అలాగే డిఎ కూడా అమలు చేయడం లేదని అన్నారు. ఆశాలకు ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని, అయినా రకరకాల యాప్‌ల భారం వేస్తున్నారని అన్నారు. 5జి సపోర్ట్‌తో పనిచేసే ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు ప్రతినెలా ఒకటో తేదీన చెల్లించాలన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామన్నారు. 2025 డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గపోరాటాలను నిర్మించేందుకు సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని అన్నారు. సమావేశంలో మాణికుమారి, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థిక ప్రగతి

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని దళిత యువత ఆర్థిక ప్రగతి సాధించాలని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. నగరంలోని ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో ఎస్‌సి సామాజిక తరగతి ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో అర్హత గల దళిత యువతకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేస్తామన్నారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూ అంబేద్కర్ విదేశీ విద్య అమలు చేస్తున్నట్లు తెలిపారు. దళితుల ఆత్మగౌరవం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్వయం ఉపాధికి సంబంధించి మహిళలకు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మోటారు, ఎలక్ట్రిక్ వాహనాలు, ట్రాక్టర్లు వంటివి అందజేస్తామన్నారు. జిల్లాలో రూ.13 కోట్ల ఎస్‌సి కార్పొరేషన్ రుణాల బకాయిలు ఉన్నాయని, బకాయిలు తీర్చి కొత్త రుణాలు పొందాలన్నారు.

మాట్లాడుతున్న మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి

యువత ఉద్యోగాలు, స్వయం ఉపాధి లక్ష్యంగా ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యాన జిల్లాలో 15 దుకాణాలు ఉన్నాయని, వీటి మరమ్మతులకు రూ.18 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎచ్చెర్లలో ఐదెకరాల ఎస్‌సి కార్పొరేషన్ భూమి చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం దళితులపై పక్షపాతంగా వ్యవహరించిందని ఆరోపించారు. గతంలో కార్పొరేషన్లు విభజించి నిర్వీర్యం చేశారని, కూటమి ప్రభుత్వం బలోపేతం చేస్తోందని చెప్పారు. సమావేశంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, కార్పొరేషన్ డైరెక్టర్లు సుజాత, నాగభూషణం పాల్గొన్నారు.

సిక్కోలు పుస్తక మహోత్సవానికి స్పందన

మాట్లాడుతున్న రచయిత అట్టాడ అప్పలనాయుడు

ప్రజాశక్తి - అరసవల్లి

నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవానికి పుస్తక ప్రియులు, సాహిత్య అభిమానుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. మూడో రోజు గురువారం పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వంద పబ్లిషర్ల, లక్ష పుస్తకాల మధ్య తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు బి.తులసీదాస్‌తో పాటు పలువురు రచయితలు, పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించడంతో పాటు పలు పుస్తకాలను కొన్నారు. పుస్తక మహోత్సవానికి ప్రత్యేకించి విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. పుస్తక ప్రదర్శనతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, పుస్తకావిష్కరణలు, కవితా పఠనం, చర్చాగోష్టి, కవి సమ్మేళనాలతో ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. జెవివి శివ నాగేశ్వరరావు ప్రదర్శించిన లో కోస్ట్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది.

రంగస్థల కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు ఎల్.రామలింగ స్వామి అధ్యక్షతన కళింగాంధ్ర నాటకంపై వక్తలు మాట్లాడారు. నాటకాల వల్ల నైతిక విలువలు పెరుగుతాయని రచయత, కళాకారుడు చలసాని కృష్ణప్రసాద్ అన్నారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ వంగపండు రచనలు సామాజిక దృక్పథంతో ఉండడం వల్లే ఆయన పాటలు ప్రజల్లోకి వెళ్లాయన్నారు. ప్రభుత్వం నాటక సమాజాలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. కె.వి రాజారావు మాట్లాడుతూ కన్యాశుల్కం రచించిన గురజాడ ఉత్తరాంధ్రకే నాంది అని అన్నారు. అనంతరం రచయిత బాల సుధాకరమౌళి రచించిన 'గాలిబోత' పుస్తకాన్ని పొదిలాపు శ్రీనివాస్ పరిచయం చేశారు. రౌతు వాసుదేవరావు రచించిన తూరుపుకొండల్లో మెరిసిన మేరంగి పుస్తకాన్ని అల్తి మోహనరావు పరిచయం చేశారు. బాలసుధాకరమౌళి, టి.ధనుంజయ్, వి.రాజారావు, కుప్పిలి చంద్రమౌళి, ఆర్.పద్మావతి, కె.వి రమణ, పి.వి నరసింహులు, కె.వాసవి కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ధర్మవరం గ్రామదళం చెక్క భజన, కోలాటం ఆడారు. బాడ సూరన్న జానపద నృత్యం ఆహూతులను అలరించింది. జెమ్స్ కళాశాల విద్యార్థినుల ఫ్లాష్‌మాబ్ ఊర్రుతలూగించి జోష్‌నింపింది. 'బాధ్యత' అనే స్కిట్ వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎం.ప్రదీప్ ఆధ్వర్యాన విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ప్రయోగాల్లో చురుగ్గా పాల్గొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా డిఎస్‌ఒ గిరడ లక్ష్మణరావుతో 'విద్యార్థులు - సైన్స్ ప్రయోగాలు' అంశంపై చర్చ నిర్వహించారు.

పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్

నేటి కార్యక్రమాలు

సాయంత్రం 4 గంటల నుంచి జీవ పరిణామంపై పి.కూర్మారావు ప్రసంగం. సిహెచ్.ఉమామహేశ్వర్ ఆధ్వర్యాన మేజిక్ షో ర్యంలో మ్యాజిక్ షో.

ఐదు గంటల నుంచి 'కళింగాంధ్ర వెనుకబాటు, సాహిత్యం, మీడియా ప్రజాసంఘాల కర్తవ్యాలు'పై చర్చాగోష్టి, కవితా పఠనం, జీవన గానం పుస్తకావిష్కరణ, కళింగ కథాజాడ పుస్తక పరిచయం.

జాలారి నృత్యం 'మా నాన్న' ఏకపాత్ర మూకాభినయం, జానపద నృత్యం, భగత్‌సింగ్, దుర్యోధన ఏకపాత్రాభినయాలు, కళాశాల విద్యార్థులతో పాశ్చాత్య నృత్యాలు.

ఫ్లాష్‌మాబ్ ప్రదర్శిస్తున్న జెమ్స్ విద్యార్థినులు

ప్రయోగాలను పరిశీలిస్తున్న విద్యార్థినులు

కిడ్నాప్ కేసులో ముగ్గురు అరెస్టు

ఎఎస్‌పి శ్రీనివాసరావు

నిందితులను ప్రవేశపెట్టిన ఎఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పలాస

పలాసలో నివాసం ఉంటున్న జీడి వ్యాపారి, బ్యాంకు కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్న వైశ్యరాజు లక్ష్మీనారాయణ రాజును కిడ్నాప్ చేసిన ఘటన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి పలాస కోర్టుకు తరలించనున్నట్లు ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లక్ష్మీనారాయణరాజు ఆముదాలవలసలో ఉన్న తన భవనాన్ని పొట్నూరు వేణుగోపాలరావుకు రూ.65 లక్షలకు లీజుకు ఇచ్చారన్నారు. తనకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకపోవడంతో ఆ భవనాన్ని బ్యాంకు సిబ్బంది సీజ్ చేస్తారని వేణుగోపాలరావుపై భవన యజమాని ఒత్తిడి చేశాడని తెలిపారు. ఈ క్రమంలో ఆ భవనాన్ని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు పథకం రచించారని పేర్కొన్నారు. దీంతో రాజును కిడ్నాప్ చేసేందుకు ఈ నెల 6న రెండు కార్లలో పలాస చేరుకున్నారని తెలిపారు. కిడ్నాప్ అయిన సంగతి తెలుసుకున్న రాజు భార్య కాశీబుగ్గ పోలీసులు దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఎక్కడికక్కడ సమాచారం అందించారని అన్నారు. పోలీసులు తమను వెంటాడుతున్నారనే భయంతో కిడ్నాపర్లు ఆముదాలవలస ఎఫ్‌సిఐ గొడౌన్ వద్ద రాజును వదిలిపెట్టి తమ కార్లలో పారిపోయారని చెప్పారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులు వేణుగోపాలరావును, అతనికి సహకరించిన కనుగులవలసకు చెందిన బొడ్డేపల్లి శ్రీనివాసరావును, తోటపాలెంకు చెందిన అలమండ తాతారావు, రాగోలుకు చెందిన పొట్నూరు జీవన్‌కుమార్‌లను అరెస్టు చేశామన్నారు. ఆమదాలవలసకు చెందిన రమేష్, గణేష్‌లతో పాటు మరో కారు డ్రైవర్‌ను అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. కిడ్నాప్‌కు వినియోగించిన కారు కూడా సీజ్ చేస్తామని అన్నారు. సమావేశంలో కాశీబుగ్గ ఇన్‌ఛార్జి డిఎస్‌పి లక్ష్మణరావు, సిఐ సూర్యనారాయణ పాల్గొన్నారు.

PUBLICATION

I, **Shailesh Kumar Tak,** resident of D.No.102, Adi Laxmi Apartment, New colony, Srikakulam town & District issuing the following publication.
That my daughter's name is **ARNIKA** is also called as **ARNIKA TAK.** Both names are belongs to my daughter and she was called as **ARNIKA** alias **ARNIKA TAK.** There is no other person having the same name. Hence this publication issued in the interest of public. Thanking you,
Yours faithfully,
SHAILESH KUMAR TAK

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని పిఎన్ కాలనీలోని మెహర్‌బాబా స్కూల్‌లో నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కామేశ్వరరావు మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా విద్యార్థులు ఎన్నో విషయాలను నేర్చుకోవడానికి దోహదపడుతుందన్నారు. పుస్తకంలోని ప్రతి అంశం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, విద్యార్థులు ఆశక్తికరమైన విషయాలు నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- గార

డిసెంబర్ 31 నుంచి విశాఖపట్నంలో ఐదు రోజుల పాటు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు అల్లు.మహాలక్ష్మి, ఎపి అంగన్వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డిసుధ పిలుపునిచ్చారు. శ్రీకూర్మంలో సిఐటియు అఖిల భారత మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మికవర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, శ్రీకూర్మంలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణమ్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

16న 'సొండి' విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి- సోంపేట

కాశీవిశ్వనాథ్ చౌదరి

సొండి సామాజిక తరగతి సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాన్ని ఈనెల 16న ఉదయం పది గంటలకు విజయనగరంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి బెహరా రాజారావు, కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు ఎస్.దివాకరరావు తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని మండల, పట్టణ, నగర, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు. సమావేశానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబరు తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. సమావేశానికి అఖిల భారత సౌండిక్ (సొండి) సంఘం కార్యవర్గ సభ్యులు, బి.కె.జె.ఎస్.ఎం కార్యవర్గ సభ్యులు, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్ర కార్యవర్గ సభ్యులూ హాజరవుతున్నారని తెలిపారు. ఇదే వేదికన విజయనగరం జిల్లా సొండి సంక్షేమ సంఘ వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వనభోజన కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు.

వైసిపి నాయకులపై కేసు నమోదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం వైసిపి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నిరసన ప్రదర్శనపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. పోలీసులు అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన ఎనిమిది మందిని ప్రధానంగా గుర్తించారు. వీరితో పాటు మరికొందరిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న పోలీసు యాక్టు 30ని ఉల్లంఘించారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, వందలాది మంది ఒక్క దగ్గర గుమిగూడారని కేసులు నమోదు చేశారు.

పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపే

పోలాకి : ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- కవిటి

కష్టపడి పనిచేసే వారికి టిడిపిలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇటీవల గ్రామ, వార్డు, మండల, టౌన్, బూత్ కమిటీల నియామకాలు చేపట్టారు. అందులో భాగంగా వారి ప్రమాణ స్వీకారం గురువారం మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికైన వారితో విప్ అశోక్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, జడ్ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాస రౌళో, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు నాయకులు సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, బాసుదేవ్ రౌళో, సంతోష్ పట్నాయక్, కొర్రాయి వాసుదేవ్, బెందాళం తిరుమల కుమార్, బెందాళం విజయ్ కృష్ణ, పుల్లట సంతోష్, పుల్లట రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : తెలుగు దేశం పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ పార్టీ నియమ నిబంధనలు మేరకు అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మండలంలోని ఈదులవలస కూడలి వద్ద ఉన్న కళ్యాణ మండపంలో గురువారం మసీక్షించారు. ఇటీవల నిర్వహించిన క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, ధర్మాన తేజ్‌కుమార్, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో లొద్దపుట్టి, తులసమ్మ కూడలి వద్ద 21 పంచాయతీల టిడిపి నూతన కార్యవర్గం అనుబంధ సంఘాల సభ్యులు సామూహికంగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, దక్కత కామేశ్వరరావు, పి.బాబ్జీ, దక్కత ఢిల్లీరావు, ఎస్.సహదేవ్, మెరుగు సూర్యనారాయణ, దుర్యోధన, మాధవరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గ టిడిపి కమిటీల ప్రమాణ స్వీకారం గురువారం ఆట్టహాసంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన మండల, క్లస్టర్,

ఆమదాలవలస : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

కవిటి : ప్రమాణ స్వీకారం చేయిస్తున్న విప్ అశోక్

యూనిట్, గ్రామ, బూత్ స్థాయి కమిటీలకు నియమితులైన వారితో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొండపల్లి అప్పలనాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బగాది శేషు, టిడిపి నాయకులు పినకాన అజయ్‌కుమార్, బోయిన రమేష్, సంబాళ శ్రీనివాస్, సాసుమంతు అనంద్, కర్రి అప్పారావు, వెలమల కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ నాగ బుద్ధ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని బూత్ కమిటీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, కన్వీనర్లు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే టిడిపి జెండాను ఎగురవేసి అనంతరం దివంగత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం నూతనంగా ఏర్పడిన వివిధ హోదాల నాయకులచే ఎమ్మెల్యే రవికుమార్, పార్టీ పరిశీలకులు జగదీశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించి కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, మొదలవలస రమేష్, తమ్మినేని చంద్రశేఖర్, డాక్టర్ చాపర సుధాకర్, సనపల ఢిల్లీశ్వరరావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను తవ్వుతున్న ప్రొక్లెయినర్

ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కడుం వద్ద వంశధార నదిలో ప్రొక్లెయినర్‌తో ఇసుకను తవ్వి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. బహిరంగ స్థలాల్లో డంపింగ్ చేసి రాత్రిపూట ఇసుకను ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఇటీవల కొంతమంది తహశీల్దార్ పి.బాలకృష్ణకు ఫిర్యాదు చేయగా, ట్రంచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తహశీల్దార్ సెలవులో ఉండడంతో మూడు రోజుల క్రితం ట్రంచ్‌లను తొలగించి యథావిధిగా ఇసుక రవాణా అవుతుంది. అధికారులు స్పందించి అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

విచారణ చేపడుతున్న తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి

రేషన్ డీలరుపై విచారణ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బంటుకొత్తూరు రేషన్ డిపో డీలర్ యర్ర ధనలక్ష్మిను గురువారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని, రేషన్ సరుకులు కోసం వచ్చిన వారిపై చురు, బుర్రు ఆడుతున్నరని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టామని తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి తెలిపారు. రికార్డులకు, డిపోలో ఉన్న సరుకులు తేడా ఉందా? లేదా? అని పరిశీలించారు. రేషన్ సరుకులు పంపిణీపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతో పాటు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ తిరుపతిరావు, ఆర్ఐ ప్రసాదరావు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

విచారణ చేస్తున్న సిఐ సూర్యనారాయణ

అప్పలరాజుపై మళ్లీ విచారణ

పలాస : మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై మళ్లీ కాశీబుగ్గ పోలీసులు గురువారం విచారించారు. మధ్యాహ్నం 3.45 గంటలకు ఆయన కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా సిఐ పి.సూర్యనారాయణ ఆయనను వివిధ కేసులకు సంబంధించి ముందుగానే సిద్ధం చేసిన ప్రశ్నావళి ప్రకారం జవాబులు అడిగి తెలుసుకున్నారు. కాశీబుగ్గ శ్రీనివాసలాడ్జి కూడలి వద్ద వైసిపి ఆధ్వర్యాన నకిలీ మద్యం, అధిక ధరలకు విక్రయాల నేపథ్యంలో ర్యాలీ నిర్వహించడం, పోలీసులపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేసిందుకు 41 నోటీసులు ఇచ్చి విచారణకు హాజరుకావాలని నాలుగు రోజుల క్రితం పోలీసులు నోటీసులు అందించారు. తనకు గడువు కావాలని మాజీ మంత్రి కోరిన మీదట పోలీసులు ఆయకు అవకాశం ఇచ్చారు. అనంతరం గురువారం మధ్యాహ్నం ఆయన నేరుగా తమ న్యాయవాదులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం ఆయనను విచారించారు. కొన్ని ప్రశ్నలు వేసిన అనంతరం వాటిని రికార్డు చేశారు.

కొంచాడలో చేపడుతున్న పారిశుధ్య పనులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

పొందూరు : మండలంలోని కొంచాడలో గురువారం కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని పలు వీధుల్లో గల కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను, మురుగును తొలగించి శుభ్రం చేశారు. ఎంపిటిసి ప్రతినిధి ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మందస: మండలంలోని కొత్తపల్లి పంచాయతీలో ఎటువంటి తాగునీటి సమస్య వచ్చినా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ సేనాపతి దివ్య, ప్రతినిధి మురళి అన్నారు. ఈ మేరకు కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు గురైన బోరును గురువారం బాగు చేశారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో సాంకేతికతదే అగ్రస్థానం

జూనియర్ సివిల్ జడ్జి వాణి

ప్రజాశక్తి- నరసన్నపేట

భవిష్యత్‌లో సాంకేతికతదే అగ్రస్థానమని, అందులోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రోగ్రామింగ్, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ ముందు ఉంటాయని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అన్నారు. కోర్టు హాల్‌లో గురువారం ఐఐటి మద్రాస్‌తో ఒప్పందం కుదుర్చుకుని స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం ద్వారా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌పై పట్టున్నవారు మేటి అవకాశాలు సొంతం చేసుకుంటారని అన్నారు. ఆ దిశగా ఆలోచించి పద్మావతి జూనియర్ కళాశాల ఐఐటి మద్రాస్‌తో స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగమవడం సంతోషం అన్నారు. విద్యార్థులు ఇంజినీరింగ్ రంగంలోకి అడుగుపెట్టే సమయంలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పించడంతోపాటు తగిన

ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో జడ్జి వాణి

మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నామని కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ వివరించారు. ఇంజినీరింగ్ ప్రపంచంతో విద్యార్థులు అనుసంధానం కావడానికి అవసరమైన వాస్తవిక అనుభవాలను అందించడంలో ఐఐటి మద్రాస్ ఈ కోర్సు రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో సాయిసంతోషి, న్యాయవాదులు గొండు సత్యం, రోణంకి కృష్ణంనాయుడు, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఆర్. సింహాచలం పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ

ఎచ్చెర్ల : మండలం ఫరీద్‌పేట పంచాయతీ సర్పంచ్ కొత్తకోట పూర్ణ చంద్రరావు చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ ప్రజల తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ తదితర మౌలిక సదుపాయాలు సజావుగా సాగేందుకు ఈ ఉత్తర్వులు విడుదలయ్యాయి. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించి తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. ఉపాధిహామీ పథకం చెల్లింపుల విషయంలో ఫిర్యాదు మేరకు సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేశారు. అయితే ఆ మొత్తం చెల్లింపులు జరపడంతో పాటు, గతంలో హైకోర్టులో సంబంధించిన వ్యక్తులు ఫిర్యాదు వెనక్కి తీసుకోవడంతో చెక్‌పవర్‌ను పునరుద్ధరించారు. అలాగే కార్యదర్శి, డిప్యూటీ ఎంపిడిఒ లేఖ మేరకు ఈ ఉత్తర్వులు విడుదలయ్యాయి. పంచాయతీ రాజ్ నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పంచాయతీలో పాలనా పరంగా ఆర్థిక పరమైన ఖర్చుల నిమిత్తం కార్యదర్శి, డిప్యూటీ ఎంపిడిఒ సూచనలు పాటించాలి.

మామయ్య.. నాన్నేరి?

- ప్రమాదంలో తండ్రి మృతి
- నిరాశ్రయులైన ముగ్గురు చిన్నారులు

ప్రజాశక్తి - కవిటి

'నాన్న ఇక రాడని, తమ ఇంటికి వస్తున్న వారు తమను పరామర్శించేందుకు వస్తున్నారని తెలియని' ఆ చిన్నారులు "మామయ్య... నాన్నేరి? నిన్నటి నుంచి ఇంటికి రాలేదు... ఎక్కడికి వెళ్లారు?" అంటూ వేస్తున్న అమాయక ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వచ్చినవారు మూగబోతున్నారు. అభం శుభం తెలియని ఆ చిన్నారులకు ఏం చెప్పాలో తెలియక కన్నీటి పర్యంతమవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... కవిటి మండలం గొండ్యాలపుట్టుగకు చెందిన బైరెడ్ల రమేష్ (41) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల రెండు రోజులపాటు అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకున్నాడు. మంగళవారం తిరిగి విధుల్లో చేరి, ఒడిశా నుంచి కంచిలి మండలం జలంత్రకోటకు ప్రొక్లెయినర్ తీసుకెళ్తుండగా, రాయగడ సమీపంలోని ప్రమాదకర మలుపులో లారీ బ్రేకులు విఫలమయ్యాయి. దీంతో వెనుక భాగంలో ఉన్న భారీ ఇనుప వస్తువు రమేష్‌పై పడటంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దారుణ ఘటనతో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది. భార్య మోహిని, ఏడేళ్ల కుమారుడు హర్షిత్, ఇద్దరు కవల పిల్లలు భవిష్య (3), భవిత (3), వృద్ధురాలైన తల్లి కర్రమ్మ ఒక్కసారిగా

విషణ్ణవదనంలో భార్య మోహిని, చిన్నారులు

దిక్కులేని పరిస్థితిలో మిగిలిపోయారు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబానికి గ్రామస్తులు, స్నేహితులు తాము చేయగల సాయం అందిస్తున్నారు.

దాతల అండ అవసరం

ఊహించని ప్రమాదం బైరెడ్ల రమేష్ కుటుంబాన్ని చీకటిలోకి నెట్టింది. ముగ్గురు చిన్నారులు హర్షిత్, భవిష్య, భవిత తండ్రి కోసం ఎదురుచూస్తున్నారు. కడదాక తోడుంటానని చెప్పి సురేష్ కనుమరుగైపోవడంతో భార్య మోహిని, అన్నీతానై ఆదరిస్తున్న కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో తల్లి కర్రమ్మ కన్నీటి సముద్రంలో మునిగిపోయారు. ఇప్పుడా కుటుంబం ఆర్థికంగా కష్టాల్లో ఉంది. మనసున్న దాతలు ఈ నెంబరు 7093049998కు ఆర్థికసాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మందులు అందిస్తున్న దేవరాజు సాహు

మాణిక్యపురంలో వైద్య శిబిరం

కవిటి: వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు, మాణిక్యపురం సర్పంచ్ ప్రతినిధి దేవరాజు సాహు అన్నారు. మాణిక్యేశ్వరి యూత్ ఆధ్వర్యాన జెమ్స్ సౌజన్యంతో మాణిక్యపురంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పాటు గ్రామస్తులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, జెమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే దిగుబడులు

లావేరు: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారానే పంట దిగుబడులు సాధించ వచ్చునని ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నీలవేణి అన్నారు. మండలంలోని బుడుమూరులో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చునన్నారు. రబీ సీజన్‌లో చోడి, మొక్కజొన్న, నువ్వులు, మినుములు, పెసలు వంటి అపరాలు సాగు చేసుకోవడం వలన దిగుబడులు సాధ్యమన్నారు. మరింత సమాచారం రైతులకు కావాలంటే 1800 4198800 నంబర్‌కు సంప్రదించాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

ఆడియో ద్వారా రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త

షాపులను కొల్లగొట్టిన దొంగల ముఠా

పరిశీలన చేపడుతున్న ఎస్ఐ చిరంజీవి

- రెండు గునపాలు విడిచిపెట్టి వెళ్లిన దొంగలు
- క్లూస్ టీంతో పరిశీలన

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి దొంగల ముఠా చెలరేగింది. జాతీయ రహదారికి అనుకుని ఉన్న రోడ్డులో షాపులను కొల్లగొట్టి నగదును దోచుకున్నారు. పక్కాప్లాన్ ప్రకారం ఈ చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. రాత్రి సమయంలో కుడా జాతీయ రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ నిత్యం జనాలు తిరుగాడే ప్రాంతంలో ఒకేసారి ఇలాంటి చోరీలు జరగడం ఇదే ప్రథమం. గొర్లె సన్యాసరావు గిఫ్ట్ ఆర్టికల్ షాపు షట్టర్ తాళాలు గుణపాంతో విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి సుమారు రూ.25 వేలు నగదును దోచుకున్నారు. నారాయణ శెట్టి సాంబమూర్తి బట్టల షాపు షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించి సుమారు రూ.4 వేలు నగదు దోసుకున్నారు. అలాగే భాస్కరరావు చెప్పుల షాపు, రామారావు పుస్తకాల షాపు షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలకి వెళ్లారు గాని నగదు లేకపోవడంతో వెనుదిరిగారు. అలాగే బాలాజీ సూపర్‌మార్కెట్, డిజిఎం శ్రీనివాసరావు బట్టలషాపు, గోరు నెలరాజు సెల్‌షాపు షట్టర్ తాళాలు పగలగొట్టారు గాని షట్టర్‌కు ఉన్న లోపల తాళాలు తెరుచుకోకపోవడంతో ఆషాపుల్లో చోరీలు జరగలేదు. చోరీలకు వాడిన రెండు గుణపాలను సహరా శ్రీను షాపు వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయారు. ముఖ్యంగా షాపుల వద్ద అమర్చిన సిసి కెమేరాలను తిప్పేశారు. షాపుల ముందు ఉన్న లైట్లు కూడా తొలగించారు. ఒక సిసి కెమెరాలో మాత్రం రాత్రి 12 గంటల తరువాత ఒక వ్యక్తి మంకీ టోపీ పెట్టుకుని, చేతులకు గ్లౌజులు పెట్టుకుని తెలుపురంగు టీషర్టు వేసుకుని కనిపిస్తున్నాడు. మొత్తం ఎంతమంది ఈ చోరీలకు పాల్పడి ఉంటారనే విషయం స్పష్టంగా తెలియడం లేదు. అలాగే నాలుగు రోజుల క్రితం రామతీర్థం రోడ్డులో ఉన్న ఉండ్రాల శ్రీనివాసరావు షాపు మీదన సిమెంట్ రేకులకు కన్నం పెట్టి షాపులోకి ప్రవేశించి రూ.35 వేలు విలువచేసే ఖరీదైన సిగరెట్లు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈచోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన చోరీలపై షాపు యాజమానులు గురువారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీలు జరిగిన షాపులను జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి క్లూస్‌టీం సహాయంతో పరిశీలించారు. చుట్టుపక్కల ఉన్న సిసి కెమెరాలను సైతం పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఫర్నిచర్ షాపులో కాలిబూడిదైన డిజైనింగ్ యంత్రం

షార్ట్ సర్క్యూట్‌తో షాపులు దగ్ధం

జి.సిగడాం రూరల్: మండలంలోని వాండ్రంగి గ్రామ పాతబస్టాండ్ జంక్షన్ పరిధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫర్నిచర్, మొబైల్ షాపు దగ్ధమైంది. గ్రామానికి చెందిన అరసవిల్లి రాంబాబు, పొగిరి తవిటినాయుడు రోజువారిలా బుధవారం రాత్రి పని ముగించుకుని షాపులు మూసివేసి ఇంటికి వెళ్లిపోయారు. గురువారం తెల్లవారి జామున సమయం 2 గంటల నుంచి 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండుషాపులకు నిప్పంటుకుంది. చుట్టుపక్కల ఉన్నవారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చి మంటలను అదుపుచేశారు. రాంబాబు ఫర్నీచర్ షాపులో బతుకుతెరువు, కుటుంబ పోషణ కోసం పెట్టుకున్న విలువైన డిజైన్ మిషన్, కలప కాలి బుడిదయ్యాయి. తవిటి నాయుడు తమ కుటుంబ జీవనోపాధి కోసం మొబైల్ షాపు పెట్టి జీవనాన్ని సాగించేవాడు. షార్ట్ సర్క్యూట్‌తో షాపులో ఉండే మొబైల్స్, మొబైల్ రిపేరింగ్ స్పేర్ పార్ట్స్, మొబైల్ షోల్డర్ పరికరాలు దగ్ధమయ్యాయి. కాగా తమ ఫర్నిచర్ షాపులో రూ.20 లక్షల వరకు, మొబైల్ షాపులో సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు అరోపిస్తూ భోరున విలపించారు. తమకు ప్రభుత్వం అదుకోవాలని వేడుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామ్మూర్తి (ఫైల్)

కవిటి: గత నెల 16న సంభవించిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పొందూరుపుట్టుగకు చెందిన దూగాన రామ్మూర్తి గురువారం మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో రామ్మూర్తితో పాటు అతని కొడుకు ప్రణయ్ కూడా గాయపడ్డాడు. ఐతే దాతల సహాయంతో చికిత్స కొనసాగడంతో ప్రణయ్ కోలుకుని ఇంటికి చేరుకున్నాడు. కానీ, తీవ్రంగా గాయపడిన రామ్మూర్తిని రక్షించేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తికి జైలు శిక్ష

శ్రీకాకుళం సిటీ: పట్టణంలో మద్యం మత్తులో హడావిడి చేసిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నెల రోజులు జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని వాంబేకాలనీ రోడ్డులో మద్యంమత్తులో వీరంగం సృష్టించి హడావిడి చేసిన ముంజేటి రవిమోహన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై ఓపెన్ డ్రింకింగ్ కేసునమోదు చేసి గురువారం శ్రీకాకుళం సెకండ్ క్లాస్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినట్లు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో ఒడిశావాసి మృతి

జగన్నాథ్ బెహరా మృతదేహం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కాశీబుగ్గ బస్టాండు ఆవరణలో ఒడిశా కు చెందిన వ్యక్తి అనుమానాస్పదంగా రక్తపు మడుగుల్లో మృతి చెంది ఉండడాన్ని గురువారం కాశీబుగ్గ పోలీసులు గుర్తించారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండు ఆవరణలో తలకు గాయమై రక్తపు మడుగుల్లో ఉన్న వ్యక్తిని ఎవరైనా హత్య చేశారా? లేక ఏదైనా వాహనం ఢీ కొనడంతో మృతి చెంది ఉంటాడా? అనేది తెలియాల్సి ఉంది. కాగా, మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు ప్రకారం మృతుడు జగన్నాథ్ బెహరా (50) సౌధాసాహి సనాసత గ్రామం, గజపతి జిల్లా, ఒడిశా ఆధారాలు లభించాయి. అనుమానాస్పదంగా పడి ఉన్న మృతని తల కింద లుంగీ పెట్టుకొని పడుకునే భంగిమలో ఉన్నాడు. తలకు గాయాలు ఉండడంతో రక్తం మడుగు కట్టింది. సంఘటన స్థలాన్ని సిఐ సూర్యనారాయణ, అర్బన్ ఎస్ఐ చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

వృద్ధుడు అదృశ్యం

కనకరాజు

లావేరు: మండలంలోని కేశవరాయని పాళెం గ్రామానికి చెందిన వృద్ధుడు నాయన కనకరాజు ఇంట్లో భార్య, కుమారుడుతో గతనెల 21న గొడవ పడి అక్కడ నుంచి అదృశ్యమైనట్లు ఆయన కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు గురువారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ గదుల లక్ష్మణరావు తెలిపారు. ఆయన ఎత్తు 6 అడుగులు, చామన ఛాయ, తెలుపు టీషర్టు, లుంగీ కట్టుకుని టవల్ వేసుకుని ఉంటాడని, ఆయన ఆచూకీ తెలిసిన వారు లావేరు పోలీస్‌స్టేషన్ 6309990851 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కుక్కర్ పేలి ముగ్గురికి గాయాలు

వజ్రపుకొత్తూరు : మండలంలోని లక్ష్మీదేవిపేట (నువ్వలరేవు) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వంట చేస్తున్న సమయంలో కుక్కర్ పేలిన ఘటనలో ముగ్గురు మధ్యాహ్న భోజన పథకం కార్మికుకులు తీవ్ర గాయాలపాలయ్యారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో విద్యార్థుల కోసం వంట చేస్తున్నారు. పది లీటర్ల సామర్థ్యం గల కుక్కర్లో కంది పప్పు ఉడికిస్తున్నారు. ఒక్కసారిగా కుక్కర్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. అక్కడే వంట చేస్తున్న కార్మికులపై వేడి ఆవిరితో ఉడుకుతున్న పప్పు తుళ్లి పడింది. ఈ సంఘటనలో మువ్వల దశమంతి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరు బైనపల్లి మోహిని, బైనపల్లి హేమా శరీరం గాయాల పాలయ్యారు. శబ్దం వినగానే ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు కంచరాన జయరామ్ బాధితులను స్థానికుల సహకారంతో ఆటోలో వజ్రపుకొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు రిచర్డ్ బూన్, తేజస్మిత బాధితులకు తక్షణ వైద్య సేవలను అందించారు. మెరుగైన వైద్యం కోసం 108లో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని, రెండు మూడు రోజులు వైద్యుల పర్యవేక్షణ అవసరమని వైద్యులు తెలిపినట్లు సమాచారం. పాఠశాలలో 258 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఘటనలో విద్యార్థులకు ఏమీ కాకపోవడంతో ఉపాధ్యాయులు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్ వజ్జ బాబూరావు, సప్ప నవీన్, నాగరాజు ఉన్నారు. అలాగే తహశీల్దార్ డి.సీతారామయ్య, ఎంపిడిఒ రమేష్‌నాయుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధితులను పరామర్శించారు.

గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిరోధక చర్యల్లో భాగంగా గురువారం రైల్వేస్టేషన్‌లో ఎస్ఐ ఎస్.బాలరాజు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ఈ తనిఖీలను నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమరవాణా వినియోగాన్ని అరికట్టే భాగంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో జిఆర్‌పి ఎస్ఐ మధు సూదనరావు బృందం పాల్గొని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో పోలీసు జాగిలంతో ప్రయాణికుల లగేజీ అనుమానాస్పద వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలరాజు మాట్లాడుతూ అక్రమ కార్య కలాపాలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో సివిల్, జిఆర్‌పి పోలీసులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ విభాగానికి చెందిన అధ్యాపకులు ప్రొఫెసర్ జయవర్ధనరావు సాహుకారు, ప్రొఫెసర్ చుండూరు అనిల్ కుమార్ ఎఐ, మెషిన్ లెర్నింగ్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అనే పుస్తకాన్ని సంయుక్తంగా రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ యుగంలో సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం వంటి సాంకేతికతలు సమాజ భద్రతకు ప్రధాన ఆధారాలు అవుతున్నాయన్నారు. వేగంగా పెరుగుతున్న సైబర్ దాడులను అరికట్టడంలో మేధస్సు ఆధారిత విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని భావించారు. విద్యార్థులు పరిశోధకులు ఈ రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే, భవిష్యత్‌లో సైబర్ భద్రత రంగంలో కొత్త ఆవిష్కరణలకు దారి తీస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆర్ అండ్ డి డాక్టర డి.శ్రీరాములు, సిఎస్‌డిహెచ్‌ఒడి డాక్టర్ టి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న డివిఇఒ సురేష్‌కుమార్

నిధుల మంజూరుకు వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి రేగ సురేష్ కుమార్ కోరారు. పిఎం శ్రీ నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా డివిఇఒ, నరసన్నపేట ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల, జిల్లా ప్రతినిధి దుగ్గివలస రాంప్రసాద్ గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ రకాల సౌకర్యాల ఏర్పాటుకు పిఎం శ్రీ ద్వారా నిధులు అందజేయాలన్నారు. శ్రీకాకుళంలోని కేంద్రీయ విద్యాలయంలో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ డైరెక్టర్ కళ పి.వేణుగోపాల్, డిప్యూటీ కమిషనర్ రాజేందర్ కుమార్ వర్మ, కన్సల్టెంట్ విజయ్ చౌదరి, ఆనంద్ సింగ్ బిష్ట్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ పుల్లట రమేష్ కుమార్‌లను కలిసి వివిధ అంశాలపై కళాశాలల అభివృద్ధికి వివరించారు. రూ.కోట్లు నిధులు మంజూరు చేసేందుకు కేంద్రం సుముఖంగా ఉందని, ప్రోపర్ ఛానెల్ ద్వారా ప్రజాప్రతినిధుల సహకారంతో నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని ప్రతినిధులు తెలిపారు.

సూపర్ సిక్స్ అమల్లో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న శిరీష

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమల్లో విఫలమైందని వైసిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి కొర్ల శిరీష విమర్శించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ.2.36 లక్షల కోట్లు అప్పులతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలో నెట్టేశారని అన్నారు. నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ప్రతి పథకంలో కోతలు అమలు చేస్తున్నారన్నారు. అమరావతి నిర్మాణం తప్ప మిగతా అంశాలు గాలికి వదిలేశారని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, మొంథా తుపాను బాధితులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సాధ్యం కాని హామీలతో అధికారం చేపట్టి, హామీలు విస్మరించారన్నారు. మద్యం, ఇసుక అక్రమ వ్యాపారం జరుగుతుందని ఆరోపించారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ అన్యాయమన్నారు. పేదలకు వైద్యవిద్య దూరం అవుతుందని, రాష్ట్రంలో వైద్యం వ్యాపారంగా మారుతుందని, కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేఖంతో ఉన్నారని, 2029 సార్వత్రిక ఎన్నికల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.

ఘనంగా వన భోజనాలు

రణస్థలం : విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్తీక మాసం వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వేలాది సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్తీక మాసం, అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గం క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకొని రణస్థలం హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు, ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు, ఎపి స్టేట్ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, రాష్ట్ర తూర్పుకాపు చైర్మన్ పాలవలస యశస్విని, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు మాధవ నాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక విలువలకు కృషి

ప్రజాశక్తి- ఆమదాలవలస

బాలల్లో ఎన్నో సృజనాత్మక విలువలు దాగి ఉంటాయని, వాటిని వెలికితీసి ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించి, పదవీ విరమణ తర్వాత కూడా బాలల నైపుణ్యం పెంచేందుకు కుప్పిలి వెంకట రాజారావు కృషి చేస్తున్నారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మనసులో మాటలను వివరించారు. పట్టణానికి చెందిన కవి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కె.వి.రాజారావు పిల్లలచే కవితలు, గేయాలు, కథలు రాయించి, వాటిని తన సొంత ఖర్చుతో పుస్తకంగా ముద్రణ చేయిస్తున్నారు. అలాగే చిన్నచిన్న నాటికలు రచించి, వాటిని పిల్లలచే ప్రదర్శన చేయించి బహుమతులు కూడా అందుకున్నారు. వివిధ రకాల సాంస్కృతిక పోటీలకు పిల్లలను తీర్చిదిద్దడం ఈయన ఒక సామాజిక బాధ్యతగా భావిస్తారు. పసిడి పలుకులు అనే బాలల కవితా సంకలనం వెలువరించారు. 'పాఠాలే పాటలైతే' అనే బాలగేయాల పుస్తకం ప్రాథమిక స్థాయి విద్యార్థులకు మార్గదర్శిగా ఉంటుంది. 'పోషకాహారం'పై రాజారావు రచించిన నాటిక ఎస్‌సిఇఆర్‌టి బహుమతి పొందింది. గతంలో తెలుగుభాష గొప్పతనాన్ని రచించిన నాటిక ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రదర్శించబడింది.

విత్తనాల పంపిణీ

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రబీ సీజన్‌కు రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకుని లాభసాటి వ్యవసాయం చేయాలని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు మాట్లాడుతూ రైతులు ఆధార్, భూమి వివరాలతో రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, టిడిపి నాయకులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, చిదపాన ధర్మార్జునరెడ్డి, కర్రి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి పతకాలు

శ్రీకాకుళం సిటీ: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థిని రెడ్డి వెంకట రమ్య 37వ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్‌లో రెండు పతకాలు సాధించింది. ఈ విద్యార్థినిని కళాశాలలో అధికారులు గురువారం అభినందించారు. ఈనెల 8న విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రోలర్ స్కేటింగ్ ఆల్పిన్ ఈవెంట్‌లో బంగారు పతకం, డౌన్ హిల్ ఈవెంట్‌లో కాంస్య పతకాలు సాధించింది. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్ నాయక్, స్పోర్ట్స్ కౌన్సెల్ అధ్యక్షులు ఎల్.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. గ్రామాల్లో సిసి రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, తదితర సమస్యలు వచ్చాయని, కొన్ని సమస్యలను వెంటనే అధికారులుతో మాట్లాడి పరిష్కారం చేశామన్నారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

కార్యకర్తకు అండగా టిడిపి

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేసుకోవడం ద్వారా ప్రమాద సమయంలో పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల జరిగిన తొక్కిసలాటలో డొక్కరి అమ్మడమ్మ మృతి చెందడంతో ఆమె భర్త రాజారావుకు రూ.5 లక్షల చెక్కును గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారికి ఆర్థికంగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, బడ్డ నాగరాజు, దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

విజేతలతో ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని గిరిజన సామాజిక భవనం ఆవరణంలో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ పాఠశాల పోటీలు గురువారం నిర్వహించారు. సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ బాల, బాలికలు అండర్-14, 17, 19 పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలోఎమ్మెల్యే పాల్గొని విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు కేవలం గెలుపు కోసం కాకుండా, జీవితంలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమన్వయాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని అన్నారు. యువ క్రీడాకారులు తమ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి అన్ని విధాల సహకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఐటిడిఎ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, క్రీడా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కె సేవలు విస్తృతం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మాట్లాడుతున్న జగన్మోహనరావు

రైతు సేవా కేంద్రాలు ద్వారా సేవలను అందజేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. వ్యవసాయ కార్యాలయంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం, రబీ 2025-26 సీజన్‌లో వివిధ పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యల గురించి గురువారం ఇన్‌ఛార్జిలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ పంటలైన అపరాలు, వేరుసెనగ, నువ్వులు, మొక్కజొన్న పంటల్లోని ఎరువుల యాజమాన్యం పురుగు, తెగులు యాజమాన్యం గురించి వివరంగా తెలిపారు. కార్యక్రమంలో ఆమదాలవలస విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్ , టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం ఎఒలు ఎన్.శ్రీనివాసరావు, ఎస్.గోవిందరావు, పి.శ్రీకాంత్ వర్మ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించాలి

వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

ప్రజాశక్తి- సోంపేట

జర్నలిస్టులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను ఆక్రమదారుల చెర నుంచి విముక్తి కల్పించాలని సోంపేట, కంచిలి ప్రెస్‌క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్, ఎస్‌ఐలను వేర్వేరుగా గురువారం కలిసి వినతిపత్రాలను అందజేశారు. సోంపేట పట్టణంలో 2009లో సర్వే నంబరు 210/1లో 8 మంది జర్నలిస్టులకు అప్పటి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. ఈ స్థలాలపై సోంపేట పట్టణానికి చెందిన ఓ నాయకుడు కన్ను పడిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో సదరు నాయకుడు స్థలాలను ఆక్రమించుకుని పాత్రికేయులకు ఇబ్బంది పెడుతున్నాడని, ఈ విషయంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు సంబంధించి హద్దులను గుర్తించి వాటిని జర్నలిస్టులకు అందజేయాలని కోరారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ తక్షణమే ఆ భూమి పైకి సర్వేయర్‌ను పంపించి హద్దులు గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న హైమావతి

అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులుగా హైమావతి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులుగా బి.హైమావతి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారానికి అనేక ఉద్యమాలు ఆందోళన చేపట్టిన హైమావతిని మరోసారి అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ముందు పోటీగా మరో అంగన్వాడీ కార్యకర్త పోటీలో నిల్చొన్నారు. కార్యకర్తలందరూ హైమావతికే మద్దతు తెలపడంతో ఆమె పోటీ నుంచి విరమించుకున్నారు. దీంతో మరోసారి అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులుగా హైమావతి ఎన్నిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యదర్శిగా భారతి, సంయుక్త కార్యదర్శిగా ఎన్.బాలామణి, ఉపాధ్యక్షులుగా జయ, కోశాధికారిగా సుహాసిని ఎన్నికయ్యారు. అనంతరం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్య కర్తలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసు కోవాలని కోరారు. అలాగే హైమావతిని విప్ అభినందించారు.

రేపు రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలకు జట్టు ఎంపిక

పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు 14 ఏళ్ల లోపు విభాగంలో బాలబాలికల రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సంతోష్ కుమార్, సుడియా వెంకట జోగారావు, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.తవిటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 1.1.2011 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, నాలుగు పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 20, 21 తేదీల్లో మందస మండలం సొండిపూడి ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గురుకులం తనిఖీ

కంచిలి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను స్థానిక మండలాధికారులు గురువారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. స్థానిక ఎంపిడిఒ వి.తిరుమలరావు, ఉపాధి ఎపిఒ ధనంజయ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనాలు చేసి నాణ్యత పరిశీలించారు. పాఠశాల మైదానంలో నిర్మిస్తున్న ఫుట్‌బాల్ కోర్టును పరిశీలించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అవగాహన కల్పిస్తున్న జడ్జి పరేష్ కుమార్

డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని, రాజీకి అనుకూలమైన కేసులు పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి తెలిపారు. కోర్టు హాల్‌లో కోటబొమ్మాళి న్యాయవాదులు, పోలీస్, బ్యాంకు సిబ్బందితో వేర్వేరుగా గురువారం సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని ఆమె తెలియజేశారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇస్తామని తెలిజేశారు. ఈ సమావేశాల్లో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసులు, న్యాయవాదులు పి.రమేష్, పల్లి వాసుదేవరావు, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపాడ, జలుమూరు పోలీసులు, బ్యాంకుల న్యాయ సలహా న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కలశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యాన తెలుకుంచిలో జూనియర్ సివిల్ జడ్జి పరేష్ కుమార్ చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. 'నేరం అంటే ఏమిటి, రాజ్యాంగం కల్పించే హక్కులు, న్యాయ వ్యవస్థ విధానం ఎలా ఉంటుంది న్యాయ సలహాలు ఏ విధంగా తీసుకోవాలి' వంటి విషయాలు తెలియజేశారు. వందేమాతరం 150 ఏళ్ల చరిత్రని గ్రామస్తులు తెలిపి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఐక్యత దినోత్సవ వేడుకగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు గణిత అవధాని ఎం.తిరుపతి చర్చా గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెరుగు సూర్యనారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ పాండవ సంతోష్‌కుమార్, కార్యదర్శి హేమలత, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి శిక్షణ పరిశీలన

ఆమదాలవలస: కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పొందూరు : శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వృత్తివిద్యా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల క్షేత్రస్థాయి శిక్షణ ఆన్ ది జాబ్ ట్రైనింగ్ (ఒజెటి) ఎంతో ఉపయోగకరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఒజెటి జిల్లా కమిటీ కన్వీనర్ బొమ్మాళి శ్యాంసుందర్ అన్నారు. గురువారం ఆయన జిల్లా ఒజెటి కమిటీ సభ్యులు దుగ్గివలస రాంప్రసాద్, జె.రవిబాబుతో కలిసి పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపిహెచ్‌డబ్ల్యు, ఎంఅండ్‌టి గ్రూపుల విద్యార్థులు పొందుతున్న క్షేత్రస్థాయి శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇమ్మానుయేల్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ అధినేత, శిక్షకులు పొన్నాడ విజయ్ విద్యార్థులకు వివిధ ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రాక్టికల్ శిక్షణ ద్వారా తమ సాంకేతిక నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని సూచించారు. అనంతరం జొన్నవలసలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో శిక్షణ పొందుతున్న ఎంపిహెచ్‌డబ్ల్యు విద్యార్థుల శిక్షణ సరళిని కమిటీ పరిశీలించింది. జిల్లా వృత్తివిద్యా శాఖాధికారి రేగ సురేష్‌కుమార్ సూచనల మేరకు ఒజెటి కార్యక్రమాన్ని సమర్థ వంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పొందూరు: విద్యార్థులు వృత్తివిద్యా కోర్సుల ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని స్థానిక సిస్టమ్ కళాశాల కరస్పాండెంట్ ఎం. మోహనరావు అన్నారు. స్థానిక సిస్టమ్ కళాశాలలో ఎంపిహెచ్‌డబ్ల్యు (ఎఫ్) చదువుతున్న విద్యార్థులకు గురువారం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న అధికారులు

స్వయం సహాయక సంఘ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా టిడిపి సాధికారకమిటీ సభ్యుడు నాగళ్ల మురళీధర్ యాదవ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని 10 వ వార్డు పరిధిలోని మెట్టక్కివలసలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక మహాజన సభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుందని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు తమ వంతు పాత్రను పోషించి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సమావేశంలో మొత్తం 25 సంఘాల సభ్యులు, ఇసి, ఒబి కమిటీ సభ్యులు పాల్గొని గడచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పలు అంశాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కొత్త పదాధికారులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కుంచి గౌరీ, కోశాధికారిగా మండల భూదేవి, కార్యదర్శిగా దవల రాజేశ్వరి, కార్యదర్శిగా అనంత మహేశ్వరి, ఉప కార్యదర్శిగా జామి సత్యవతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కారుణ్య ధర్మారావు, సిఒ వినోద్, ఆర్‌పి వెంపటాపు శోభ, రాణిరుద్రమదేవి స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయునికి అభినందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

గణిత ఉపాధ్యాయుడును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా విశిష్టసేవలు అందించిన విద్యా వేత్తలను జిల్లా స్థాయిలో సత్కరించిన వారిలో పట్టణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు షేక్ షావలికి ప్రత్యేక గౌరవం లభించడం ఎంతో ఆనందదాయకమని తోటి ఉపాధ్యాయులు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ఉపాధ్యాయులు పైల రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు షేక్ షావలిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నవంబర్ 11న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, ఇతర జిల్లా అధికారులు కలిసి షేక్ షావలిని ఘనంగా సత్కరించి ఆయన విద్యా సేవలను అధికారులు ప్రశంసించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జిటిఎ) జిల్లా అధ్యక్షుడు పైడి రామస్వామి నాయుడు, ఎంఇఒలు రాములు, టింగ రాజు, పసిడి మొగ్గ మోహనరావు, ఉపాధ్యాయులు ఎం.వి.ఆర్. బట్లు, కోట ఈశ్వరరావు, ఎస్. సులోచన రాణి, తాండ్ర చంద్ర మనోహర్ కుమార్, బంగారు శరత్ కుమారి, అరుణ, ఉమాకుమారి, కుమారి, చౌదరి నాగేశ్వరరావు, రాంబాయమ్మ, రాజేశ్వరి అభినందించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం, జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన పుస్తకాలతో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు, డ్రగ్స్‌పై అవగాహన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్యలను స్మరించుట, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, కవి సమ్మేళనం, 18న పర్యావరణంపై చిత్రలేఖన పోటీలు, ఆటలు, పాటల పోటీలు, 19న ఇందిరాగాంధీ జయంతి, మహిళా దినోత్సవ సందర్భంగా రంగవల్లుల పోటీలు, 20న గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు, అక్షరాస్యత దినోత్సవం, చదవడం మాకిష్టంలో భాగంగా సామూహిక స్వీయ పఠనం డిజిటల్ లైబ్రరీపై అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు, విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేయబడునని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మెళియాపుట్టి: శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో ఎంఇఒలు దేవేందరరావు, పద్మనాభంలు, స్థానిక యుపి స్కూల్ హెచ్‌ఎంలు గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల్లో చదవు అలవాటు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థీ పుస్తకాలు చదవడంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ పాల్గొన్నారు.

నందిగా : ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ వారం రోజుల పాటు క్రీడలు, క్విజ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు.

జల జీవన్ మిషన్ బోర్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి- జి.సిగడాం రూరల్

ప్రజలకు తాగునీరు సౌకర్యం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని టిడిపి మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ అన్నారు. గురువారం మండలంలో పాలఖండ్యాం పంచాయితీ సీతారాంపురంలో జల జీవన్‌మిషన్ పథంలో భాగంగా రూ.27 లక్షలు, ఆనందపురం పంచాయితీ అబోతు గ్రామంలో రూ.8 లక్షలతో గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలకు ఇంటింటి కుళాయి కలెక్షన్ల ద్వారా 'సురక్షితమైన తాగునీటిని అందించడానికి బోర్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను సమకూరుస్తున్నాయని, బోర్ల ద్వారా కుళాయిలకు నీరు సరఫరా చేసేలా ఈ పథకం పనులు జరుగుతున్నాయన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ చిత్తిరి మంజు, దారబోయిన రెయ్యమ్మ, రైల్వేజోనల్ ప్రాంతీయ సలహాసభ్యులు బాలబొమ్మ వెంకటేశ్వర రావు, సర్పంచ్ ప్రతినిధి దారబోయిన ధర్మరాజు, చిత్తిరి మోహన్, వజ్జపర్తి రఘురాం, పొగిరి నారాయణరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగరాజు, టంకాల అప్పల నాయుడు, రమణ, మానం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

రణస్థలం రూరల్ : టెండర్లు పూర్తిచేసి, ఒప్పందాలు పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్, జలజీవన్ మిషన్ పనులపై వాటి పురోగతిని సమీక్షించడానికి ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మంజూరైన అన్ని పనులు అత్యంత వేగంగా పూర్తి చేయాలన్నారు. పైప్‌లైన్ పనుల్లో గమనించిన ప్రధాన సమస్యలు, కాంట్రాక్టర్లు సిమెంట్ రోడ్లను తవ్వుతున్న విధానం సరైందికాదని, పైప్‌లైన్ వేయడం పేరుతో కాంట్రాక్టర్లు సిమెంట్ రోడ్లను రెండు అడుగుల వెడల్పుతో తవ్వుతున్నారని, తవ్విన రోడ్లను తిరిగి సరిగా పూడ్చడం లేదన్నారు. గ్రామాల్లో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారని, తవ్విన రోడ్లకు వెంటనే సిసి పాచ్‌వర్క్స్ చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, పైప్‌లైన్ కోసం తవ్విన ప్రతి సిమెంట్ రోడ్డును తక్షణమే మూసివేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పూర్తికాని పనులకు రీటెండర్ పనుల కోసం వెంటనే పున:టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. పెండింగ్ ఒప్పందాలపై రోజువారీ రిపోర్ట్‌ను ఎమ్మెల్యే కార్యాలయానికి పంపాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస ఎస్‌ఇ శంకర బాబు, డిఇఇ దుర్యోదన పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశ్రమ సందర్శన

నరసన్నపేట: ప్రభుత్వం తలపెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ ఉచిత ట్రైనింగ్ ప్రోగ్రాం గత 30 రోజులుగా స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక సుసిన్ స్పోర్ట్స్ తయారీ కేంద్రాన్ని అధ్యాపకులు నెయ్యిల జాహ్నవి ఆధ్వర్యాన విద్యార్థులు సందర్శించారు. ఈ సెషన్ స్పోర్ట్స్‌లో క్రీడారంగానికి సంబంధించిన వస్తువుల తయారీ, దాని విధానం, మిషనరీ సుశాంత్ స్పోర్ట్స్ అధినేత షుగున్ క్లుప్తంగా వివరించారు. ప్రోగ్రాం ట్రైనింగ్ అవుతున్న విద్యార్థులు ఈ స్పోర్ట్స్‌కు సంబంధించిన తయారీ గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ చిన్న, మధ్య తరగతి సూక్ష్మ సందర్శనలో భాగంగా ఎంఎస్‌ఎంఇ ప్రోగ్రామర్ అరుణ్‌కుమార్, పరిశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివరిస్తున్న స్పోర్ట్స్ అధినేత